బీజేపీ, వైసీపీలను ఓడించాలి



- లేకపోతే మరోసారి అరాచక పాలనే!
- విభజన చట్టం హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం
- కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

-వార్త 7వ పేజీలో

భూ సమీకరణ ముసుగులో వైసీపీ నేతల అక్రమాలు

ప్రభుత్వ భూమి సాగు చేసుకుంటున్నట్టు రెవెన్యూ రికార్డుల్లో బినామీల పేర్లు



- ప్రభుత్వం నుంచి పరిహారం కొట్టేయడానికి స్కెచ్
- అనకాపల్లి మండలం కోడూరులో 39.38 ఎకరాల ప్రభుత్వ భూమికి టెండర్
- మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.50 లక్షలు
- మొత్తం భూమి విలువ రూ.20 కోట్లు పైమాటే!
- ఆధారాలతో సహా ఫిర్యాదు చేసిన విపక్షాల నేతలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో భూ సమీకరణ ముసుగులో అధికార పార్టీ నాయకులు పాల్పడుతున్న అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. రెవెన్యూ అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకుని, ప్రభుత్వ భూములు రైతుల సాగులో వున్నట్టు తప్పుడు రికార్డులు సృష్టించి ప్రభుత్వం నుంచి లబ్ధిపొందడానికి ప్రయత్నిస్తున్నారు. అనకాపల్లి మండలం కోడూరు గ్రామంలో భూ సమీకరణలో భాగంగా తమ భూములను ప్రభుత్వానికి అప్పగించినట్టు రెవెన్యూ రికార్డుల్లో చూపి, అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో ఏడు ఎకరాలకు పైగా కొట్టేయడానికి ప్లాన్ వేశారు. మార్కెట్ ధర ప్రకారం ఈ భూమి విలువ రూ.20 కోట్లు వుంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.




ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ గతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన సరిహద్దు రాయి

జగనన్న ఇళ్ల కాలనీలు, ప్రభుత్వ పారిశ్రామిక వాడల ఏర్పాటు పేరుతో వైసీపీ ప్రభుత్వం మూడేళ్ల క్రితం భూ సేకరణతోపాటు భూ సమీకరణ కూడా జరిపింది. భూ సమీకరణ నిబంధనల ప్రకారం పట్టా ఉన్న రైతు నుంచి ఎకరా భూమి తీసుకుంటే, ఇందుకు ప్రతిఫలంగా అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో 18 సెంట్ల స్థలం ఇవ్వాలి. ఒకవేళ పట్టా లేకుండా రైతు సాగులో వుంటే ఎకరాకు తొమ్మిది సెంట్ల చొప్పున స్థలం ఇవ్వాలి. ప్రభుత్వ అవసరాల కోసం జిల్లాలో అత్యధికంగా అనకాపల్లి మండ లంలో భూ సమీకరణ జరిపారు. మొత్తం 13 గ్రామాల్లో సుమారు 800 ఎకరాలను

కోడూరు సర్వే నంబరు 20లో ప్రభుత్వ భూమి

రెవెన్యూ అధికారులు సమీకరించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కయ్యారు. ప్రభుత్వ భూములు ఖాళీగా వుండగా, ఆయా భూములను సాగు చేసుకుంటున్నట్టు రెవెన్యూ రికార్డుల్లో అధికార పార్టీ మద్దతుదారుల పేర్లను చేర్చారు. మండలంలోని కోడూరులో జరిగిన భూ బాగోతం ఇందుకు ఒక ఉదాహరణగా చెప్పాలి. వైసీపీకి చెందిన స్థానిక నేత ఒకరు కోడూరులో సర్వే నంబరు 20లో వున్న 39 ఎకరాల 38 సెంట్ల ప్రభుత్వ భూమిపై కన్నేశారు. వాస్తవానికి 2009లో రెడ్డి అనే వ్యక్తి ఈ భూములను అప్పట్లో రైతుల నుంచి కొనుగోలు చేశారు. అయితే పట్టా భూములైన వీటిని కొనుగోలు చేయడంపై అప్పట్లో ... మిగతా 8వ పేజీలో



Adangal Report

జిల్లా: Anakapalli - అనకాపల్లి					మండలం: ANAKAPALLI - అనకాపల్లి			గ్రామం: Koduru - కోడూరు				Survey No: 20			
క్రమ సంఖ్య	సర్వే నెం	పూర్తి విస్తీర్ణం	సాగుకు పనికి రాని విస్తీర్ణం	సాగుకు పనికి వచ్చు విస్తీర్ణం	భూమి స్వభావం	శిస్తు (రూ.)	భూమి వివరణ	జల ధారము	ఆయకట్టు విస్తీర్ణం	ఖాతా నెంబరు	పట్టాదారు పేరు (తండ్రి/భర్త పేరు)	అనుభవదారుని పేరు (తండ్రి/భర్త పేరు)	అనుభవదారుని విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు)	అనుభవ స్వభావం	రిమార్కులు
1	20	39.38	39.38	0.0	ప్రభుత్వభూమి	0.0	పోరంబోకు	--	0.0	2.0000104E7	పోరంబోకు (పోరంబోకు)	పోరంబోకు (పోరంబోకు)	39.38	unknown	

ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదైన కోడూరు సర్వే నంబరు 20లో 39.38 ఎకరాలు

చోడవరంలో భూ దందా

ఆర్టీసీ స్థలాన్ని లీజుకు తీసుకున్న స్థానికులు

- పక్కనే వున్న పంచాయతీ, దేవదాయ శాఖ స్థలాలపై కన్ను
- యంత్రాలతో చదును.. చోద్యం చూస్తున్న అధికారులు
- కబ్జాదారులకు అధికార పార్టీ నేతల అండ

చోడవరం, జనవరి 9:

పట్టణంలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఆర్టీసీ స్థలం లీజుకు తీసుకుని దానికి ఆనుకుని ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడానికి ప్రయత్నించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతున్నది. అధికార పార్టీ నేతల అండతో ఆర్టీసీ స్థలాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తులు.. దీంతోపాటు పక్కనే వున్న పంచాయతీ భూమి, చెరువు గట్టు, దేవదాయ శాఖకు చెందిన స్థలాన్ని కూడా చదును చేస్తున్నారు. కోట్ల రూపాయల విలువైన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నప్పటికీ పంచాయతీ, రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్టుగా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావితీస్తున్నది.



ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆనుకుని పంచాయతీ స్థలాన్ని చదును చేసిన దృశ్యం



చదును చేసిన దేవదాయ శాఖ స్థలం

చోడవరంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చెందిన స్థలాన్ని ఇటీవల స్థానికులు కొందరు నెలకు రూ.1.56 లక్షల అద్దె చెల్లించేలా టెండర్ విధానంలో లీజుకు తీసుకున్నారు. దీనికి పక్కనే పంచాయతీకి చెందిన 12 సెంట్ల స్థలం వుంది. ఇంకా దేవదాయ శాఖ భూమి, రెవెన్యూకు చెందిన చెరువు వున్నాయి. ఆర్టీసీ స్థలాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తులు ఈ స్థలానికి ఆనుకుని దేవదాయ శాఖ, పంచాయతీ స్థలం, చెరువు భూమిని కూడా ఆక్రమించి చదును చేయిస్తున్నారు. ఇక్కడ దుకాణాలు నిర్మించి అద్దెకు ఇవ్వాలన్నది లీజుదారుల ఆలోచన. పంచాయతీ స్థలం కబ్జాపై వార్డు సభ్యులు రెండు రోజుల క్రితం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ప్రస్తావించి, పంచాతీయ స్థలానికి సరిహద్దులు నిర్ణయించాలని పట్టుబట్టినట్టు సమాచారం. ఇదిలా ఉండగా ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించిన స్థలం గతంలో దేవదాయ శాఖకు చెందినదని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రజల అవసరాల దృష్ట్యా ఆర్టీసీకి నామమాత్రం ధరకు కొంత స్థలాన్ని విక్రయించినట్టు చెప్పారు. మిగిలిన స్థలం ఇప్పటికీ దేవదాయ శాఖ ఆధీనంలోనే వుంది. ఆర్టీసీ కాంప్లెక్స్ స్థలాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తులు దేవదాయ శాఖకు చెందిన స్థలంతోపాటు, పంచాయతీ స్థలం, చెరువు స్థలం కూడా ఆక్రమించి చదును చేస్తున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లీజుదారులకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో, భూ కబ్జాదారులపై అధికారులు చర్యలు తీసుకోవడం లేద న్న విమర్శలు వినిపిస్తున్నాయి. భూ ఆక్రమణలపై ఆందోళనలు చేసే ప్రజాసంఘాలు కూడా ఇక్కడ ఆక్రమణలపై మౌనం వహించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కోట్ల రూపాయల విలువైన స్థలం అన్యాక్రాంతం అవుతున్నా, అధికార యంత్రాంగం ప్రేక్షకపాత్ర వహించడంపై స్థానికులు మండిపడుతున్నారు.

ఇదిలావుండగా ఆర్టీసీ స్థలాన్ని ఆనుకుని పంచాయతీ స్థలం వుందని పాలకవర్గ సభ్యులు చెప్పడంతో సర్వే నిర్వహించామని, అది ఆర్టీసీ స్థలంగానే నిర్ధారణ అయ్యిందని పంచాయతీ ఈవో నారాయణరావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అయినప్పటికీ మరింత స్పష్టత కోసం సమగ్రంగా సర్వే ... మిగతా 8వ పేజీలో

మరణంలోనూ వీడని బంధం

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి



ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న చిన్న కుమారుడు సాయి సూరజ్

- ఎలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్ద ఘటన
- సొంతూరు కాకినాడ జిల్లా కిర్లంపూడి
- కొంతకాలం నుంచి విశాఖలో నివాసం
- వ్యక్తిగత పనులపై కారులో సొంతూరు వెళ్లిన భార్యాభర్తలు
- విశాఖకు తిరిగి వస్తుండగా ప్రమాదం



దొరబాబు, వీరవేణి (ఫైల్ ఫొటో)

ఎలమంచిలి, జనవరి 9:

మరికొద్ది సేపట్లో ఇంటికి చేరుకోవాల్సిన దంపతులను లారీ రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. జీవితంలోనే కాదు... మరణంలోనూ తమ బంధం విడదీయరానిదంటూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. ఎలమంచిలి మండల పరిధిలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతిచెందగా, ఆస్పత్రికి తరలిస్తుండగా భర్త మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన ఏనుగు దొరబాబు(53), వీరవేణి(42) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు.. షణ్ముక్ ప్రవీణ్ (కోల్‌కతాలో ఉద్యోగం), సాయి సూరజ్(సీఏ చేస్తున్నాడు). దొరబాబు విశాఖలో కాంట్రాక్ట్ పనులు చేస్తుంటారు. సుమారు ఏడాది క్రితం నుంచి విశాఖలోని మధుర వాడలో నివాసం వుంటున్నారు. ఇదిలావుండగా వ్యక్తిగత పనుల నిమిత్తం దొరబాబు, వీరవేణి కారులో ఇటీవల సొంతూరు కిర్లంపూడి వెళ్లారు. సోమవారం రాత్రి ఏడు గంటల సమయంలో తిరిగి విశాఖపట్నం బయలుదేరారు. వీరవేణి కారు నడుపుతున్నారు. 9.45 గంటలకు ఎలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్దకు చేరుకున్నారు. ఇక్కడ అడ్డుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయే క్రమంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, అవతలవైపునకు దూసుకుపోయింది. ఇదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొన్నది. దీంతో కారు నుజ్జునుజ్జు అయ్యింది. భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వీరవేణి అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దొరబాబును హైవే అంబులెన్స్‌లో ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతదేహాలను మార్చురీకి తరలించి, మృతుల బంధువులకు సమాచారం అందించారు. చిన్నకుమారుడు సాయి సూరజ్, బంధువులు మంగళవారం ఉదయం ఇక్కడకు చేరుకున్నారు. సూరజ్, కుటుంబ సభ్యులు పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్దకు వెళ్లి ప్రమాదానికి గురైన కారును పరిశీలించి కన్నీటిపర్యంతం అయ్యారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కిర్లంపూడి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గఫూర్ తెలిపారు.

29వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె



బుచ్చెయ్యపేటలో ఎండు గడ్డి తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారానికి 29వ రోజుకు చేరింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదని అంగన్‌వాడీలు ఆరోపించారు. మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న నిరసన శిబిరాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బుచ్చెయ్యపేటలో ఎండు గడ్డి తింటూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి నమ్మించి మోసం చేశారంటూ దేవరాపల్లిలో అంగన్‌వాడీలు చెవుల్లో పూలు పెట్టుకొని, మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఇదిలావుండగా అంగన్‌వాడీల సమ్మెపై ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు అనకాపల్లిలో 'జైల్‌భరో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి నెహ్రూచౌక్‌కు ర్యాలీగా చేరుకుని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు.

పారిశుధ్య కార్మికులు వినూత్న నిరసన



ఎలమంచిలిలో అర్ధనగ్నంగా మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

న్యాయమైన డిమాండ్ల సాధనకోసం అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలిలో మునిసిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల సమ్మె కొనసాగుతున్నది. అనకాపల్లి, నర్సీపట్నంలో 15వ రోజుకు, ఎలమంచిలిలో 8వ రోజుకు చేరింది. కార్మికులు దీక్షా శిబిరాల్లో వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లిలో పారిశుధ్య కార్మికులు భిక్షాటన చేశారు. ఎలమంచిలిలో అర్ధనగ్నంగా, మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. నర్సీపట్నంలో కార్మికుల దీక్షా శిబిరాన్ని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సందర్శించి, సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ఇదిలావుండగా పారిశుధ్య కార్మికుల సమ్మె కారణంగా రహదారులపై చెత్తాచెదారం, డ్రైనేజీ కాలువల్లో పూడిక పేరుకుపోయాయి. పారిశుధ్యం క్షీణించడంతో ఈగులు, దోమలు, పందుల బెడద పెరిగిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఊరు చివరకు తోపుడు బండ్లు!

ట్రాఫిక్ సమస్య పేరుతో పెద్ద చెరువు వద్దకు తరలింపు

- మునిసిపల్ అధికారులు నిర్ణయం
- ఎన్టీఆర్ మినీ స్టేడియం వద్ద తోపుడు బండ్లు వెంటనే తీసేయాలని ఆదేశాలు
- లబోదిబోమంటున్న చిరువ్యాపారులు

నర్సీపట్నం, జనవరి 9:

రహదారుల విస్తరణ పేరుతో పట్టణంలో తోపుడు బండ్ల వ్యాపారులను బలవంతంగా పెద్ద చెరువు గట్టు వద్దకు తరలించడానికి మునిసిపల్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీనిపై చిరువ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. పెద్ద చెరువు వద్ద జనసంచారం ఉండదని, దీంతో వ్యాపారాలు సాగవని అంటున్నారు.



గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించిన పెద్ద చెరువు గట్టు

పట్టణంలో అబీద్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి మదుం వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. అబీద్ సెంటర్, పాల్‌ఘాట్ సెంటర్, సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు చాలా వరకు పూర్తి చేశారు. పాల్‌ఘాట్ సెంటర్ నుంచి డివైడర్ పనులు వేగంగా జరుగుతున్నాయి. కాగా రోడ్డు విస్తరణలో భాగంగా ఎన్టీఆర్ మినీ స్టేడియంను ఆనుకొని ఉన్న మునిసిపల్ దుకాణాలలో వ్యాపారులను ఖాళీ చేయించి భవనాన్ని పడగొట్టేశారు. వారిలో చాలా మంది తోపుడు బండ్ల మీద వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇంకా సిటీ క్లబ్‌ను ఆనుకొని తోపుడు బండ్ల మీద దుస్తులు చెప్పులు, ఫ్యాన్సీ సామగ్రి అమ్ముకునే చిరువ్యాపారులు ఉన్నారు. వీరందరి వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందంటూ మెయిన్‌రోడ్డు మీద తోపుడు బండ్ల వ్యాపారులను అక్కడి నుంచి ఖాళీ చేయించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. వీరిని నర్సీపట్నం పెద్ద చెరువు వద్దకు తరలించాలని మునిసిపల్ అధికారులు ప్లాన్ వేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి అబీద్ సెంటర్ వరకు మెయిన్ రోడ్డులో 54 మంది ... మిగతా 8వ పేజీలో



సిటీ క్లబ్‌ని ఆనుకొని ఉన్న తోపుడు బండ్లు

సమగ్రశిక్ష ఉద్యోగి మృతితో ఉద్రిక్తత



జడ్డు వాసుదేవరావు (ఫైల్ ఫొటో)

- గత నెల 23న నిరసన శిబిరంలో ఉన్నప్పుడే బ్రెయిన్ స్ట్రోక్
- చికిత్స పొందుతూ మృతి
- మృతదేహంతో అనకాపల్లి డీఈవో కార్యాలయం ఎదుట కుటుంబీకులు, ఉద్యోగుల ఆందోళన
- రూ.10 లక్షల పరిహారం, మృతుని భార్యకు ఉద్యోగం ఇచ్చేందుకు మంత్రి అంగీకరించినట్టు మాజీ ఎమ్మెల్యే వెల్లడి

-వార్త మెయిన్ ఎడిషన్‌లో

ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,

9985411639

ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.

9985411029

క్రైం... crime news

దోనె తిరగబడి వృద్ధుడి మృతి

మునగపాక, జనవరి 9: మండలంలోని వాడ్రాపల్లి పరిధిలో వున్న ఆవలో దోనె తిరగబడి వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాడ్రాపల్లికి చెందిన పిల్లా గంగరాజు(62) దోనె సాయంతో ఆవలో చేపల వేట సాగిస్తుంటాడు. రోజూ మాదిరిగానే మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటలకు సహచర మత్స్యకారులతో కలసి దోనెపై చేపల వేటకు వెళ్లాడు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత గంగరాజు మినహా మిగిలిన వారంతా ఒడ్డుకు వచ్చారు. గంగరాజు కోసం ఆవలో గాలింపు చర్యలు చేపట్టారు. ఒకచోట దోనె తిరగబడి కనిపించింది. దానిని పైకెత్తి చూడగా గంగరాజు నిర్జీవంగా కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఆవ నుంచి ఒడ్డుకు తీసుకువచ్చి పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మహమ్మద్ అలీ తెలిపారు.

800 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

నర్సీపట్నం అర్బన్, జనవరి 9: మండలంలోని గురందొరపాలెం శివారు తోటల్లో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల బెల్లం పులుసును నర్సీపట్నం రూరల్ ఎస్ఐ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ధ్వంసం చేశారు. గురందొరపాలెం గ్రామం వద్ద తోటల్లో నాటుసారా తయారు చేస్తున్నట్టు తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్టు ఎస్ఐ తెలిపారు. గోతుల్లో దాచిపెట్టిన పులుసును ధ్వంసం చేసినట్టు తెలిపారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలు.. రెండు వాహనాలు సీజ్

అచ్యుతాపురం, జనవరి 9: మండలంలోని నునపర్తి పంచాయతీ నడింపల్లి గ్రామ శివారులోని కొండ ప్రాంతంలో వైసీపీ నాయకులు గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుపుతున్నట్టు తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు మంగళవారం సాయంత్రం తహసీల్దార్ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు ఆర్ఐ సోమేశ్‌కుమార్, వీఆర్వో శశిధర్ అక్కడకు వెళ్లారు. గ్రావెల్ తవ్వకాలకు వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్, గ్రావెల్ రవాణా చేస్తున్న టిప్పర్ లారీని సీజ్ చేశారు. అనంతరం మండల కేంద్రానికి తీసుకువచ్చి పోలీసులకు అప్పగించారు.


రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్, టిప్పర్ లారీ

పింఛన్ నగదుతో పంచాయతీ కార్యదర్శి పరారీ

పాడేరు రూరల్, జనవరి 9: పాడేరులోని మారుమూల సలుగు పంచాయతీలో లబ్ధిదారులకు ఇవ్వాల్సిన పింఛన్ సొమ్ముతో కార్యదర్శి పరారయ్యారు. దీంతో 9వ తేదీ వచ్చినప్పటికీ లబ్ధిదారులకు పింఛన్ అందలేదు. పంచాయతీ కార్యదర్శి కె.బాలకృష్ణ 32 మంది లబ్ధిదారులకు సంబంధించిన పింఛన్ నగదు రూ.96 వేలును పాడేరు బ్యాంకులో ఈ నెల 1వ తేదీన విత్‌డ్రా చేశారు. ఈ నగదును సలుగు పంచాయతీకి వెళ్లి వలంటీర్లకు అందించి లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే వలంటీర్ వచ్చి పింఛన్ ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఆరా తీశారు. దీంతో కార్యదర్శి పింఛన్ నగదు ఇవ్వలేదని తెలిసి ఈ నెల 7వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఎంపీడీవో కె.సాయినవీన్ పింఛన్ నగదు డ్రా చేసిన పంచాయతీ కార్యదర్శి గురించి ఆరా తీయగా, ఎటువంటి సమాచారం లేదు. దీంతో పింఛన్ల పంపిణీకి ఈ నెల 10వ తేదీ వరకు సమయం ఉన్నందున వేచి చూడాలని, అప్పటికీ పంపిణీ చేయకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో తెలిపారు.

10 లీటర్ల నాటుసారా, 48 మద్యం సీసాలు స్వాధీనం

పాయకరావుపేట, జనవరి 9: పోలీసులు మంగళవారం రెండుచోట్ల దాడులు నిర్వహించి 10 లీటర్ల నాటుసారా, 48 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటికి సంబంధించి ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్ఐ జోగారావు, సిబ్బందితో కలిసి పట్టణంలోని పాతపేట శివారులో తనిఖీలు నిర్వహించారు. కందూరి పైడితల్లి నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని మంగవరం గ్రామంలో ఒక ఇంటిలో నిల్వ ఉంచిన 48 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని గీసాల లక్ష్మి, గీసాల శివలను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి ఎలమంచిలి కోర్టుకు తరలించారు.


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

బీజేపీ, వైసీపీలను ఓడించాలి


సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం. చిత్రంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కొప్పుల రాజు, తదితరులు ఉన్నారు

- కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రాల్లో నిరంకుశ విధానాలకు అమలుచేస్తున్న బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలను ఓడించేందుకు భావ సారూప్యత కలిగిన పార్టీలు ముందుకురావాలని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం పిలుపునిచ్చారు. దళిత, గిరిజన, బీసీ, మైనారిటీ, ప్రజా సంఘాల నేతలతో మంగళవారం నగరంలోని పౌర గ్రంథాలయంలో సమాలోచన పేరుతో సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జేడీ శీలం మాట్లాడుతూ బీజేపీ, వైసీపీలను ఓడించి ఇంటికి సాగనంపాలని, లేకపోతే అరాచక పాలన మరోసారి చవిచూడాల్సి వస్తుందన్నారు. విభజన చట్టంలోని హామీల అమలు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రభుత్వ రంగ సంస్థలకు రక్షణ ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యులు కొప్పుల రాజు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ జోడో యాత్ర తరువాత దేశంలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుందన్నారు. దాని ఫలితంగానే కర్ణాటక, తెలంగాణల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. మణిపూర్‌లో దారుణాలు జరిగినా, క్రీడాకారులు రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేసినా మోదీ కనీసం స్పందించలేదన్నారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అప్పులతో దేశంలో, రాష్ట్రంలోని ప్రజలపై భారం పడుతోందన్నారు. ప్రతినెలా జీతాలు ఇచ్చేందుకు అప్పులు చేయాల్సిన దుస్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని, ఈ పరిస్థితి మారాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. అణగారిన వర్గాలపై అణచివేతలు పెరుగుతున్నాయని, చట్టాలు అండగా ఉండడం లేదని, బాధితులపైనే కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనికి ఉదాహరణ కోడి కత్తి శ్రీను కేసును ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో కుట్ర కోణం లేదని ఎన్ఐఏ కోర్టు చెప్పినప్పటికీ బెయిల్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో దళితుల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, సీపీఐ నుంచి పైడిరాజు, విరసం ఐక్య వేదిక వెంకటరావు, దళిత హక్కుల ఐక్య ఐక్య వేదిక పోరాట సమితి నాయకులు కొత్తపల్లి వెంకటరమణతోపాటు వివిధ వర్గాలకు చెందిన నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	65.00
లైవ్ ధర	85.00
విత్ స్కిన్	140.00
స్కిన్ లెస్	150.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చదువు, ఆరోగ్యమే నిజమైన సంపద

- కిమ్స్ మాజీ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య
- మాతృభాషపై పట్టు ఉండాలి
- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీనారాయణ
- ఘనంగా శ్రీప్రకాష్ విద్యా సంస్థల వార్షికోత్సవం


మాట్లాడుతున్న కిమ్స్ మాజీ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య


మాట్లాడుతున్న రిటైర్డ్ స్పెషల్ సెక్రటరీ కె.లక్ష్మీనారాయణ


ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న రిటైర్డ్ స్పెషల్ సెక్రటరీ కె.లక్ష్మీనారాయణ

పాయకరావుపేట, జనవరి 9: తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే నిజమైన సంపద చదువు, ఆరోగ్యమేనని కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) మాజీ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య అన్నారు. మంగళవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల 47వ వార్షికోత్సవ వేడుకలను 'జోష్' పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి విద్యార్థి గ్రహించాలని, నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. బాగా చదువుకుని, ఆరోగ్యం వుంటే కచితంగా ఉన్నతస్థితికి చేరుకుంటారన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రత్యేక కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, మాతృభాషపై పట్టు వుంటేనే మిగిలిన భాషలపై పట్టు సాధించగలమని అన్నారు. జీవితంలో ఉత్తమ మార్గాన్ని ఎంచుకునే శక్తిసామర్థ్యం చదువు ద్వారానే వస్తుందన్నారు. మరో గౌరవ అతిథి బసవ తారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సీఈవో డాక్టర్ కూరపాటి కృష్ణయ్య మాట్లాడుతూ, ఎటువంటి స్వార్థం లేకుండా జ్ఞానాన్ని పంచే గురువులను విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోకూడదన్నారు. జీవితంలో పైకి ఎదగాలంటే క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని అన్నారు. సెకోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ కొడాలి కేశవరావు, అడ్వాన్స్‌డ్ మైనింగ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ నాదెళ్ల వెంటసుబ్బారావు, ప్రతాప్ ఇండస్ట్రీస్ ఎండీ వైవీఎస్.చలపతిరావు తదితరులు మాట్లాడారు. తొలుత ఏపీ ప్రభుత్వ మాజీ ప్రత్యేక కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయస్థాయి ఆటల పోటీలు, వివిధ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముందస్తు సంక్రాంతి సంబరాలను తిలకించారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగా, పిరమిడ్స్, జుంబా డ్యాన్స్, వివిధ సాంస్కృతి కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు, ,విద్యా సంస్థల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- రానున్నది టీడీపీ ప్రభుత్వమే
- అన్ని వర్గాల ప్రజలను మోసగించిన సీఎం జగన్
- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు


పారిశుధ్య కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జనవరి 9: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారు. పారిశుధ్య కార్మికుల సమ్మెకు బుధవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని చెప్పారు.

పురపాలక శాఖా మంత్రి, ముఖ్యమంత్రి, ముఖ్య కార్యదర్శి సమ్మెలో ఉన్న కార్మికులను పట్టించుకోకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను సీఎం జగన్ మోసం చేశారని ఆరోపించారు. రోడ్డు విస్తరణ పనులకు మునిసిపాలిటీ నిధులు ఖర్చు పెట్టేస్తున్నారని అన్నారు. నాలుగున్నర సంవత్సరాల తరువాత చివరిక్షణంలో ఎమ్మెల్యే రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టారని విమర్శించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు 100 అడుగులు, అక్కడ నుంచి 90 అడుగులు రోడ్డు విస్తరణ చేస్తామంటున్నారని తెలిపారు. రోడ్డు విస్తరణ పనులకు రూ.35 లక్షలు మునిసిపాలిటీ నిధులు వాడేశారని విమర్శించారు. ఆర్ అండ్ బీ శాఖ నుంచి నిధులు తెచ్చుకునే దమ్ము ఎమ్మెల్యేకి లేక మునిసిపాలిటీ నిధులు వాడేస్తున్నారని విమర్శించారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు, 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, నేతల నాగేశ్వరరావు, ధనిమిరెడ్డి మధు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని ఇచ్ఛాపురం టు తిరుపతి పాదయాత్ర

- అశోక్ బృందానికి స్వాగతం పలికిన టీడీపీ నాయకులు


అశోక్ బృందాన్ని సత్కరిస్తున్న బుద్ద నాగజగదీశ్

తుమ్మపాల, జనవరి 9: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించి, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ నెల్లూరు జిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజా సంక్షేమ విభాగం అధ్యక్షుడు అశోక్, అతని అనుచరులు ఇచ్ఛాపురం నుంచి తిరుపతి వరకు చేపట్టిన పాదయాత్ర మంగళవారం సాయంత్రం అనకాపల్లి చేరింది. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, స్థానిక నేతలు.. పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు. అనంతరం దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. రాష్ట్రంలో మరో మూడు నెలల్లో సైకో పాలన పోవడం, చంద్రబాబునాయుడు సీఎం అవ్వడం తథ్యమని నాగజగదీశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సాలాపు నాయుడు, బీవీవీ అప్పారావు పాల్గొన్నారు.

గ్రేటర్ బడ్జెట్ రూ.5,457.23 కోట్లు

- గత ఏడాది కంటే రూ.1,393.74 కోట్లు అధికం
- ఇంజనీరింగ్ విభాగానికి 25.04 శాతం కేటాయింపు
- ప్రాజెక్టులకు 19.19 శాతం కేటాయింపు
- ప్రజారోగ్యానికి 9.64 శాతం
- రూ.4,949.89 కోట్లు ఆదాయం సమకూరుతుందని అంచనా
- విపక్షాల అభ్యంతరాల నడుమ బడ్జెట్ ముసాయిదాకు ఆమోదం తెలుపుతున్నట్టు మేయర్ ప్రకటన


మేయర్ పోడియం వద్ద విపక్షాల ఆందోళన



విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.5,457.23 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌ను గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పాలకవర్గం ఆమోదించింది. బడ్జెట్‌పై చర్చించేందుకు మంగళవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన కౌన్సిల్ ప్రత్యేకంగా సమావేశమైంది. అయితే విపక్షాలు పలు అభ్యంతరాలు వ్యక్తంచేసినా మేయర్ పట్టించుకోకుండా బడ్జెట్‌ను ఆమోదిస్తున్నట్టు ప్రకటించి, పోడియం దిగి వెళ్లిపోయారు. తొలుత సమావేశం ప్రారంభమైన తర్వాత బడ్జెట్ ముసాయిదాను మేయర్ గొలగాని హరివెంకటకుమారి చదువుతుండగా టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఆమె పోడియాన్ని చుట్టుముట్టారు. కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై ముందుగా చర్చించాలని, వారి డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మేయర్ స్పందిస్తూ ఇది బడ్జెట్ సమావేశం కాబట్టి, ఇతర అంశాలపై చర్చించకూడదని, సమావేశం ముగిసిన తర్వాత ఫ్లోర్‌లీడర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తామని చెప్పడంతో అందరూ తమ స్థానాల్లోకి వెళ్లి కూర్చున్నారు. అనంతరం బడ్జెట్‌లో ప్రతిపాదనలను చదివి వినిపించారు. 2023-24 బడ్జెట్‌తో పోల్చితే కొత్త బడ్జెట్ రూ.1,393.74 కోట్లు (34 శాతం) అధికం కావడం విశేషం. భవిష్యత్తులో నగరంలో రోడ్ల విస్తరణ, ఫ్లై ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణం, సుందరీకరణ పనులు చేయాల్సి ఉంటుందనే ఉద్దేశంతో ఇంజనీరింగ్ విభాగానికి భారీగా కేటాయింపులు చూపించారు. మొత్తం బడ్జెట్‌లో 25 శాతానికిపైగా అంటే రూ.1,366.36 కోట్లు ఇంజనీరింగ్ విభాగానికే కేటాయించారు. ఇక పలు కొత్తప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలు ఉండడంతో రూ.1,054.45 కోట్లు కేటాయింపులు చూపించడం విశేషం. మొత్తం బడ్జెట్‌లో రూ.176.09 కోట్లు సాధారణ పరిపాలన విభాగానికి, వీధి దీపాల నిర్వహణకు రూ.163.65 కోట్లు, టౌన్‌ప్లానింగ్ విభాగానికి రూ.63.41 కోట్లు, పార్కులు, శ్మశానాలు, సమాధుల పరిరక్షణ, అభివృద్ధికి రూ.181.35 కోట్లు, ప్రజారోగ్యానికి రూ.526.11 కోట్లు, నీటి సరఫరా విభాగానికి రూ.359.99 కోట్లు, అమృత్ పథకానికి రూ.504 కోట్లు, ఆర్థిక సంఘం నిధులతో చేసే పనుల కోసం రూ.498.4 కోట్లు, విదేశీ నిధులతో చేపట్టే ప్రాజెక్టులకు రూ.191.05 కోట్లు, యూసీడీ విభాగానికి రూ.25.74 కోట్లు, విద్యా విభాగానికి రూ.5.49 కోట్లు ఖర్చు చేయబోతున్నట్టు బడ్జెట్‌లో పొందుపరిచారు.

ఇక ఆదాయం విషయానికి వస్తే సాధారణ పరిపాలనా విభాగం ద్వారా రూ.1,014.69 కోట్లు, ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ.759.11 కోట్లు, ప్రాజెక్టుల ద్వారా రూ.844.10 కోట్లు, టౌన్‌ప్లానింగ్ ద్వారా రూ.332.94 కోట్లు, యూసీడీ విభాగం ద్వారా రూ.13.5 కోట్లు, విద్యా విభాగం ద్వారా రూ.15 లక్షలు, పార్కులు, శ్మశానాల ద్వారా రూ.20 కోట్లు, నీటి సరఫరా విభాగం కింద రూ.462.15 కోట్లు, అమృత్ పథకం ద్వారా రూ.312 కోట్లు, విదేశీ సంస్థలు, బ్యాంకుల ద్వారా రూ.191.05 కోట్లు, ఆర్థిక సంఘం నుంచి రూ.586.25 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్సుల రూపంలో రూ.293.75 కోట్లు మొత్తం రూ.4,949.89 కోట్లు సమకూరుతుందని అంచనా వేశారు. ప్రారంభ నిల్వ రూ.664.33 కోట్లతో కలిపితే మొత్తం జమలు రూ.5,614.22 కోట్లుగా ముసాయిదా బడ్జెట్‌లో పొందుపరిచారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ముగింపు నిల్వ కింద రూ.156.99 కోట్లు చూపించారు. ఇప్పటికే ముసాయిదా బడ్జెట్‌ను స్టాండింగ్ కమిటీ ఆమోదించడంతో కౌన్సిల్ సమావేశంలో ఆమోదించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపించాల్సి ఉంటుందని జీవీఎంసీ అధికారులు తెలిపారు.

బడ్జెట్ ముసాయిదాపై విపక్షాలు అభ్యంతరం

2024-25 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్ ముసాయిదాపై విపక్షాలు తీవ్రస్థాయిలో అభ్యంతరం తెలిపాయి. అంకెలగారడీ అంటూ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలాశ్రీనివాసరావు విమర్శించారు. గత బడ్జెట్‌లో ఎస్సీఎస్టీలకు ఎంత ఖర్చు చేశారనేది కూడా చూపించలేదని, వారి నిధులను వారికి ఖర్చుపెట్టే పరిస్థితి లేకపోవడం అన్యాయమన్నారు. ప్రతి కార్పొరేటర్‌కు రూ.ఐదు కోట్లు కేటాయిస్తూ బడ్జెట్‌లో పొందుపరచాలని డిమాండ్ చేశారు. ఇలాంటి బడ్జెట్‌ను తాము ఆమోదించడం లేదని మేయర్‌కు స్పష్టంచేశారు. టీడీపీ కార్పొరేటర్ రాపర్తి కన్నా మాట్లాడుతూ గత మూడేళ్లలో బడ్జెట్‌లో చూపించిన రూ.777.65 కోట్లకు సంబంధించిన ఖర్చులపై 1,407 అభ్యంతరాలను రాష్ట్ర ఆడిట్ జనరల్‌తోపాటు లోకల్ ఆడిట్ అధికారులు జీవీఎంసీకి పంపించారన్నారు. వీటికి అధికారులు ఎలాంటి సమాధానం ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌పై ఆయా శాఖల అధికారుల నుంచి వచ్చిన అభ్యంతరాలను బడ్జెట్‌లో జమ, ఖర్చులతోపాటు ఎందుకు చూపించడం లేదని మేయర్‌ను నిలదీశారు. ఇకపై వాటి వివరాలను కూడా అందుబాటులో ఉంచుతామని అదనపు కమిషనర్ వర్మ వివరణ ఇచ్చారు. జనసేన కార్పొరేటర్ కందుల నాగరాజు మాట్లాడుతూ మేయర్ కూడా తమలాగే కార్పొరేటర్‌గానే గెలిచినప్పటికీ, వారి వార్డులో జరిగినట్టు మిగిలిన వార్డుల్లో ఎందుకు అభివృద్ధి చేయడం లేదని పోడియం ముందుకు వెళ్లి ప్రశ్నించారు. దీనికి మేయర్ ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆయన్ను సభ నుంచి సస్పెండ్ చేశారు. తర్వాత మిగిలిన జనసేన కార్పొరేటర్లు అభ్యంతరం తెలపడంతో సస్పెన్షన్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు స్టాలిన్, బి.గంగారావు మాట్లాడుతూ వాస్తవ ఖర్చులు, ఆదాయాన్ని చూపించకుండా, ఏదో గొప్పగా ఉంటుందని బడ్జెట్‌లో ఊహాత్మక లెక్కలు చూపించారని విమర్శించారు. ముసాయిదాను సవరించాలని డిమాండ్ చేశారు. విపక్షాలు బడ్జెట్ ముసాయిదాను తిరస్కరించాలని డిమాండ్ చేస్తుండగానే మేయర్ గొలగాని హరివెంకటకుమారి జోక్యం చేసుకుని, కొత్త ఆర్థిక సంవత్సరంలో ప్రతి వార్డుకు రూ.ఐదు కోట్లు కేటాయిస్తామని చెప్పి బడ్జెట్ ముసాయిదాను ఆమోదిస్తున్నట్టు ప్రకటించి పోడియం దిగి వెళ్లిపోయారు.

భూమి హక్కులపై కొత్త చట్టాన్ని రద్దు చేయాలి

- న్యాయవాదుల డిమాండ్
- అనకాపల్లిలో ర్యాలీ, ఆర్డీవో కార్యాలయంలో ధర్నా



ఆర్డీవో కార్యాలయంలో ధర్నా చేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, జనవరి 9: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన 'ఏపీ భూమి హక్కుల యాజమాన్య చట్టం'ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు మంగళవారం ఇక్కడ ఆందోళన చేశారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయిలక్ష్మణ్ ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డులోని కోర్టు నుంచి చినవాలుగురోడ్ల జంక్షన్ మీదుగా నెహ్రూచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ధర్నా చేపట్టారు. ప్రజల ఆస్తులకు రక్షణ లేని ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సూరా శ్రీనివాస్, బంధం వెంకటరమణ, తిలక్, భవానీ ప్రసాద్, కుమార్, హర శ్రీనివాస్, సుధాకర్, గంగాధర్, వై.సాయి, మోహన్, గోవింద్, సత్యనారాయణ, సముద్రిక లీలా పాల్గొన్నారు.

వైద్య నిపుణుల కొరత నివారణకు చర్యలు

- ఏపీవీవీపీ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్


వైద్యులతో మాట్లాడుతున్న కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్

అనకాపల్లి టౌన్, జనవరి 9: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో సమావేశమై మాట్లాడారు. పిల్లలు, మత్తు వైద్యనిపుణుల కొరత తీర్చేందుకు తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రక్తపరీక్షలకు సంబంధించి ఆటో ఎనలైజర్ పరికరాన్ని ఇప్పటికే వైద్యాలయానికి మంజూరు చేశామని, త్వరలో అందుబాటులో వస్తుందని కమిషనర్ చెప్పారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ఆర్ఎంవో లక్ష్మణ్‌శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ


అశ్వ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

నక్కపల్లి, జనవరి 9: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఉపమాకలో మంగళవారం అశ్వ వాహనంపై శ్రీవారి తిరువీధి జరిగింది. ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని అశ్వవాహనంపై అలంకరించి, పూజలు చేసి హారతులిచ్చారు. పల్లకీపై గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాడవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధి వద్ద తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, సాయి గోపాలాచార్యులు, వెంకట రాజ గోపాలాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రైతుల నిరసన


తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్న పెదగంగవరం రైతులు

దేవరాపల్లి, జనవరి 9: తమ భూ సమస్యలు పరిష్కరించాలని దేవరాపల్లి సమీపంలోని అనంతగిరి మండలం పెదగంగవరం రైతులు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. తమ సమస్యకు పరిష్కారం చూపాలని వారంతా దండం పెడుతూ మంగళవారం వినూత్న నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీ రమణ, వేచలపు అప్పలనాయుడు, రామునాయుడు, అక్కునాయుడు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు

- ఇరిగేషన్ డీఈఈ జగదీశ్వరరావు


కొరుప్రోలు ఎర్ర చెరువు సర్వే చేస్తున్న అధికారులు

ఎస్.రాయవరం, జనవరి 9: గ్రామాల్లోని చెరువులు, పంట కాలువలను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పాయకరావుపేట ఇరిగేషన్ డీఈఈ జగదీశ్వరావు హెచ్చరించారు. మండలంలోని కొరుప్రోలులో ఎర్ర చెరువు గర్భం ఆక్రమణకు గురైందంటూ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త బీవీవీ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు మంగళవారం డీఈఈ, ఏఈ చిన్నారావు, మండల సర్వేయర్ త్రిమూర్తి, రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్ర చెరువు గర్భానికి చెందిన హద్దులను గుర్తించారు. సర్వే చేసి బౌండరీలు నిర్ణయించిన తరువాత చెరువు గర్భం ఆక్రమణకు గురైనట్టు ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ సర్వే రిపోర్టు అందిన వెంటనే చెరువు గర్భం ఎంత వరకు ఆక్రమణలకు గురైందనేది గుర్తించి, చర్యలు తీసుకుంటామన్నారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, **VANDRASI ADINARARAYANA (Old Name)**, S/o. Vandrasi Potti Ramayya, resident of 2-92, Ungatla Street, Mettavalasa, Vizianagaram, Change my name from **VANDRASI ADINARARAYANA (Old Name)** to **VANDRASI ADINARAYANA (New name)**. Henceforth I am being called as **VANDRASI ADINARAYANA (New name)**, S/o. Vandrasi Potti Ramayya for all purposes.
AJV_164640

డాక్యుమెంట్ పోయినది

★ లింగ మురళీ మోహన్, S/o. ఎల్.శేషగిరిరావు (లేటు), టి-3, సత్యసాయి విహార్, నరసింహనగర్, విశాఖపట్నం, అను నేను తేది.03-01-2024న జెరాక్స్ కోసం ఆటోలో వెళ్తుండగా నా యొక్క ఒరిజినల్ సేల్‌డీడ్ డాక్యుమెంట్ (No. 513/2001 SRO, ద్వారకానగర్) పోయినది. ఎవరికైనా దొరికిన యెడల 9246622337 నెంబరుకు తెలియజేయగలరు.
AJV_164641

WANTED

★ సువర్ణభూమి సంస్థలో పార్ట్ టైం / ఫుల్ టైం పనిచేయుటకు హౌస్ వైఫ్స్, రిటైర్డ్ పర్సన్స్ కావలెను. మంచి ఇన్సెంటివ్ + కమీషన్ కలదు. కోటీశ్వరులు అవ్వాలనుకునే వారికి మంచి అవకాశం. సంప్ర: 9666282005
AJV_11498

For Advertisement Contact :
9963231176
9966165093

CHANGE OF NAME

★ I, **BOLISETTI SAI SANTOSHI RESHMA (New Name)**, D/o. BOLISETTI SRINIVASA RAO, previously called **BOLISETTI SAI SANTOSH RESHMA (Old Name)**, Resident of D.No. 10-3-8/7 Flat No.107, Vaisakhi Residency, Opp. Sampath Vinayaka Temple, Kailash Metta, Visakhapatnam, Andhra Pradesh - 530003. Now changed my name from **BOLISETTI SAI SANTOSH RESHMA (Old Name)** to **BOLISETTI SAI SANTOSHI RESHMA (New Name)**. Today onward use my New Name for all further Transactions.
AJV_164642

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

టీడీపీతోనే గ్రామాలాభివృద్ధి సాధ్యం

» మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

కశింకోట, జనవరి 9 : తెలుగుదేశం పార్టీతోనే గ్రామాలన్నీ అభివృద్ధి చెందుతాయని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మంగళవారం తేగాడలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతోనే జగన్‌మోహన్‌రెడ్డి తమ ఎమ్మెల్యేలను బదిలీ చేస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. చంద్రబాబునాయుడు పాలన కోసం రాష్ట్ర ప్రజలంతా ఎదురుచూస్తున్నారని చెప్పారు. అనంతరం కరపత్రాలను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుయువత అధ్యక్షుడు సిద్దిరెడ్డి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు బుదిరెడ్డి అప్పడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాబూరావు, గంగయ్య పాల్గొన్నారు.

స్కై మార్షల్‌లో డిగ్రీ విద్యార్థినికి గోల్డ్‌మెడల్



లలిత కుమారిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శంకర్ తదితరులు

సబ్బవరం, జనవరి 9 : ఇటీవల రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి స్కై మార్షల్ పోటీల్లో అండర్-19 విభాగంలో బంగారు పతకం సాధించిన డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థిని నాగోజు లలితకుమారిని ప్రిన్సిపాల్ బి. శంకర్, అధ్యాపకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడుతూ.. లలితకుమారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. బంగారు పతక విజేత లలితకుమారి మాట్లాడుతూ.. పేదరికంలో ఉన్నా అధ్యాపకులు, కోచ్ త్రినాథరావు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో బంగారు పతకం సాధించానన్నారు.

ఓటర్ల నమోదు ప్రక్రియలో సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌వో రామలక్ష్మి

నక్కపల్లి, జనవరి 9: ఓటర్ల నమోదు ప్రక్రియ, సవరణల్లో బూత్ లెవెల్ ఆఫీసర్లకు రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని నియోజకవర్గం ఎలక్టోరోల్ రిజిస్ట్రేషన్ అధికారిణి రామలక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మృతి చెందిన వారిని ఓటర్ల జాబితాల నుంచి తొలగించడం, 18ఏళ్లు వయస్సుండి ఓటు లేని వారిని ఓటర్లుగా చేర్చడం, తదితర అంశాలకు సంబంధించి పునఃపరిశీలన చేసుకోవాలన్నారు. ఓట్లు గల్లంతైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ అంబేడ్కర్, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, వైబోయిన రమణ, మారిశెట్టి నానాజీ పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుల అరెస్టు అన్యాయం

పాయకరావుపేట రూరల్, జనవరి 9: విజయవాడ ధర్నాకు హాజరైన యూటీఎఫ్ నాయకుల అరెస్టు, వివిధ మండలాల్లో నాయకుల గృహనిర్బంధాలను యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు కె.శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శి బీవీ రమణ ఒక ప్రకటనలో ఖండించారు. తమ సమస్యలపై నెల రోజులుగా ఆందోళనలు చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడంతో విజయవాడలో 36 గంట ధర్నా యూటీఎఫ్ చేసిందన్నారు. ఈ సందర్భంగా విజయవాడలో జిల్లా నాయకులు వత్సవాయి శ్రీలక్ష్మి, నడిగట్ల శేషకుమార్, ప్రకాష్, ఎం.అప్పారావులను అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.

ఎస్.రాయవరంలో.. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని కోరుతూ విజయవాడలో ధర్నా చేస్తున్న యూటీఎఫ్ జిల్లా నేతలు వత్ససాయి శ్రీలక్ష్మిఎన్ శేషుకుమార్, తదితరులను అరెస్టు చేయడాన్ని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు వై కొండయ్య ఒక ప్రకటనలో ఖండించారు. ఉద్యోగుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. న్యాయం కోసం పోరాడుతున్న వారిని అక్రమ అరెస్టు చేయడం అన్యాయమన్నారు.

గర్భిణులకు పోషకాహారం పంపిణీ



గర్భిణులకు పోషకాహారం అందిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, జనవరి9: మండలంలోని శ్రీరాంపురం పీహెసీలో గర్భిణులకు డెక్కన్ కంపెనీ సౌజన్యంతో శ్రీసరస్వతి విద్యా సేవా సమితి ఆధ్వర్యంలో పోషకాహారాన్ని మంగళవారం అందజేశారు. ప్రతి నెలా 9వ తేదీన గర్భిణులు పరీక్షల నిమిత్తం పీహెచ్‌సీకి వస్తుంటారు. వారికి సేవా సంస్థ తరుపున పోషకాహారాన్ని అందిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గొర్రెల శివరామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి తులసీ నవీన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కల్కి అవతారంలో పాండురంగడు



పాయకరావుపేట, జనవరి 9: స్థానిక రాధారుక్మిణి సహిత పాండురంగస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా దశావతారాల్లో భాగంగా మంగళవారం పాండురంగస్వామి కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి సుప్రభాతసేవ, విశేష పూజల అనంతరం ప్రధానార్చకులు కృష్ణస్వామి పాండురంగస్వామివారిని కల్కి అవతారంలో అలంకరించారు. ఆలయ ఈఓ ఎస్.వెంకటాద్రి, అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శించుకున్నారు.

అంగన్‌వాడీలకు మద్దతుగా ప్రజా సంఘాల జైల్‌భరో



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు



పరవాడలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి 9: అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మాను ప్రయోగించడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు మంగళవారం జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి ర్యాలీగా నెహ్రూచౌక్‌కు చేరుకుని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం అన్యాయమని వక్తలు పేర్కొన్నారు. అలాగే ఎస్మా ప్రయోగాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు, జి. కోటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, పరమేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు వైఎన్ భద్రం, కోరిబిల్లి శంకరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో..
అంగన్‌వాడీల సమ్మెను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా ఎస్మా చట్టాన్ని ప్రయోగించడంపై సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సినిమాహాల్ జంక్షన్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీలు, మున్సిపల్, సమగ్రశిక్ష ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. అంగన్‌వాడీలపై ఎస్మా చట్టానికి సంబంధించి జీవో నంబరు -2 ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గేదెల అప్పారావు, కె.నాయుడు, జి.శ్రీను, ఎస్. గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల భిక్షాటన

అనకాపల్లి టౌన్, జనవరి 9 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు చేస్తున్న ఆందోళన మంగళవారానికి 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు పట్టణంలో భిక్షాటన నిర్వహించి, సమస్యలపై నినాదాలు చేశారు. తమ ఆకలి జీవితాలను దుకాణ యాజమాన్యాలకు మొర పెట్టుకున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని నినాదాలిచ్చారు. ప్రభుత్వం మొండివైఖరి విడనాడి సమస్యలను పరిష్కరించాలని కార్మికసంఘం గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ కోరారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించనట్టయితే విద్యుత్, వాటర్ సరఫరా కూడా నిలిపివేయడానికి వెనుకాడమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు జి. సత్యనారాయణ, బొమ్మల రాము, నిమ్మకాయల అజయ్‌కుమార్, శివకుమార్, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పట్టణంలో మునిసిపల్ కాంట్రాక్టు కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. మునిసిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో మంగళవారం ఏడో రోజు సమ్మెలో కార్మికులంతా అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మునిసిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తున్న పారిశుధ్య కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సంఘం నేతలు వైనూకరాజు, సీహెచ్. వెంకటరమణ, డి.మహేష్, ఈ. చంద్రరావు, నరసింహమూర్తి, నాగేశ్వరరావు, ఆదిమూర్తి, నాగరాజు పాల్గొన్నారు.



అనకాపల్లిలో భిక్షాటన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



మునగపాకలో అంగన్వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటరావు



అనకాపల్లి పట్టణ శిబిరంలో నినాదాలిస్తున్న అంగన్‌వాడీలు

అనకాపల్లి టౌన్, జనవరి 9 : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె మంగళవారం కొనసాగింది. స్థానిక నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు ఉమా నారాయణమ్మ, ధనలక్ష్మి, కాసులమ్మ, సీఐటీయూ నాయకుడు డి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరవాడలో.. అంగన్‌వాడీల సమ్మె మంగళవారానికి 29వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డిమాండ్ల పరిష్కరించడంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదన్నారు. ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు సీహెచ్. దేవి, రమణి, వెంకటలక్ష్మి, జానకి, కుమారి, ఉమా, శ్రీదేవి పాల్గొన్నారు.

మునగపాకలో.. అంగన్‌వాడీలను ప్రభుత్వం భయభ్రాంతులకు గురి చేస్తుందని, మీ వెంట కడవరకూ ఉంటామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పెంటకోట వెంకటరావు అన్నారు. మంగళవారం ఆయన అంగన్‌వాడీ ఆందోళన శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవోలు, నోటీసులు జారీ చేయడం ద్వారా అంగన్‌వాడీల్లో భయం పుట్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో.. అంగన్‌వాడీలపై ప్రభుత్వం ప్రయోగిస్తున్న ఎస్మాకు భయపడేది లేదని సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీల యూనియన్ అధ్యక్షురాలు వీవీ రమణమ్మ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం ముందు వారు చేపట్టిన సమ్మె మంగళవారం 29వ రోజు కొనసాగించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా తమపై ఎస్మా చట్టం ప్రయోగించాలనుకోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు డి.పుష్పావతి, ఆర్ఎస్ రామలక్ష్మి, ఎస్ జగదేశ్వరి, ఎం. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగతా శ్రీనివాస్‌ని పరామర్శించిన రుద్రరాజు

పాయకరావుపేట, జనవరి 9 : ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి శస్త్రచికిత్స చేయించుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్‌ని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పరామర్శించారు. మంగళవారం పాయకరావుపేటలోని జగతా శ్రీనివాస్ ఇంటికి వచ్చిన రుద్రరాజు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గంప గోవిందు, పార్టీ నాయకులు వేగి వెంకటేష్, అంబటి కృష్ణ, సనపల అన్నాజీరావు, మారుతి నారాయణచక్రవర్తి, పోలవరపు అప్పలరాజు, ప్రగడ చక్రరావు తదితరులున్నారు.



జగతా శ్రీనివాస్‌ని పరామర్శిస్తున్న పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

వైసీపీ నాయకుల సంబరాలు

ఎస్.రాయవరం, జనవరి 9: ముఖ్యమంత్రి జగన్ పాదయాత్ర ముగించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా అడ్డరోడ్డులో మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కోటవురట్ల, జనవరి 9: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన మండల సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథం తెలిపారు. బుధవారం ఉదయం పది గంటలకు జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

అగ్ని ప్రమాద బాధితునికి నిత్యావసరాలు పంపిణీ

పాయకరావుపేట రూరల్, జనవరి9: మండలంలోని రాజవరం శివారు గజపతినగరం ఎస్సీ కాలనీలో అగ్ని ప్రమాద బాధితుడు కాకాడ కొండయ్యకు వైసీపీ నాయకుడు దగ్గుపల్లి సాయిబాబా మంగళవారం నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో కాకాడ కృష్ణ, యజ్జల అన్నవరం, యజ్జల శివ, గుల్లా నాగు, ఏడిద కృష్ణ, పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు : ఎస్ఐ

కోటవురట్ల, జనవరి 9: గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని కోటవురట్ల ఎస్ఐ రమణయ్య హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా పల్లెల్లో కోడిపందాలు నిర్వహించినా, తీర్థాల పేరుతో బల్ల ఆటలు నిర్వహించినా చర్యలు తీసుకుంటామన్నారు.

భూసమీకరణ ముసుగులో వైసీపీ నేతల అక్రమాలు

... 5వ పేజీ తరువాయి

వివాదం ఏర్పడింది. ఈ భూములు కొనుగోలు చేసిన రెడ్డి అనే వ్యక్తి కొన్నాళ్ల తరువాత మృతిచెందారు 2013లో అప్పటి రెవెన్యూ అధికారులు సర్వే నంబరు 20లో వున్న 39.38 ఎకరాలు ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ భూములు ఏపీఐఐసీకి దఖలు పడినట్టు అప్పట్లో సిమెంట్ దిమ్మలు కూడా ఏర్పాటు చేశారు. ఇదిలాఉండగా భూ సమీకరణను అడ్డంపెట్టుకుని స్థానిక వైసీపీ నేతలు ప్రభుత్వానికి చెందిన ఈ భూములను బినామీ రైతుల పేరుతో తిరిగి ప్రభుత్వానికి అప్పగించి లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. 47 మంది వరకు నకిలీ రైతుల పేర్లను భూసమీకరణ రికార్డుల్లో నమోదు చేసి, పరిహారంగా అభివృద్ధి చేసిన లేఅవుట్‌లోఏడు ఎకరాలను కొట్టేయడానికి పావులుకదుపు తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఇక్కడ ఎకరా భూమి రూ.50 లక్షలు పలుకుతున్నది. లేఅవుట్‌గా అభివృద్ధి చేస్తే సెంటు రెండు లక్షల నుంచి మూడు లక్షల వరకు పలుకుతుంది. ఈ లెక్కన వైసీపీ నేతలు కొట్టేయడానికి ప్రయత్నిస్తున్న భూమి విలువ రూ.20 కోట్లు వుంటుంది.

లెక్కకు మిక్కిలిగా ఫిర్యాదులు.. పట్టించుకోని రెవెన్యూ అధికారులు

అనకాపల్లి మండలంలో భూసమీకరణ మాటున వైసీపీ నేతలు సాగిస్తున్న అక్రమాలపై గతంలో టీడీపీ, జనసేన, సీపీఎం నాయకులు, రెవెన్యూ అధికారులకు వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద స్వయంగా అమరావతి వెళ్లి భూపరిపాలన అధికారులకు ఫిర్యాదు అందజేశారు. అయినా ఇంతవరకు ఎటువంటి చర్యలు లేవు. కోడూరులోనే కాకుండా మండలంలోని పలుగ్రామాల్లో చేపట్టిన భూసమీకరణ వ్యవహారంలో కీలక పదవిలో వున్న ఒక ముఖ్యనేత తెరవెనుక ఉండడంతో భూసమీకరణ మాయాజాలంపై విచారణ జరిపించేందుకు అధికారులు సాహసించడం లేదు. ఇప్పటికైనా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్పందించి మండలంలో వివిధ గ్రామాల్లో జరిగిన భూసమీకరణ, పరిహారం చెల్లింపు కోసం అధికారులు సిద్ధం చేసిన నిర్వాసితుల జాబితాలపై క్షేత్రస్థాయిలో బహిరంగ విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాగా, అనకాపల్లి మండలం కోడూరులో భూ సమీకరణలో అక్రమాలు జరిగినట్టు వస్తున్న ఆరోపణలపై ఆర్డీఓ చిన్నికృష్ణను వివరణ కోరగా, సర్వే నంబరు 20లో భూములు తమవేనంటూ గ్రామసభలో తహసీల్దారు సమక్షంలో రైతులు అంగీకారం తెలిపారన్నారు. బినామీ రైతుల పేర్లను రికార్డుల్లో నమోదు చేశారంటూ ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు. స్థానికుల నుంచి అభ్యంతరాలుంటే విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామన్నారు.

చోడవరంలో భూ దందా

... 5వ పేజీ తరువాయి

చేయించాలని నిర్ణయించినట్టు చెప్పారు.

సర్వే చేయాలని రెవెన్యూకు వినతి

సత్యనారాయణ, ఈవో, దేవదాయ శాఖ, చోడవరం

ఆర్టీసీ యాజమాన్యం ప్రస్తుతం లీజుకు ఇచ్చిన స్థలం ఒకప్పుడు దేవదాయ శాఖకు చెందినదే. గతంలో నామమాత్రపు ధరకు విక్రయించారు. పక్కనే స్థలం దేవదాయ శాఖకు చెందినదే! సర్వే నిర్వహించి దేవదాయ శాఖ స్థలం ఎంతమేర ఉందో నిర్ధారించాలని రెవెన్యూ శాఖ అధికారులను కోరాం. వారి నుంచి ఇంకా స్పందన రాలేదు. కాగా గతంలో ఆర్టీసీకి ఇచ్చిన స్థలాన్ని ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులకు వ్యాపార అవసరాల కోసం లీజుకు ఇచ్చారు. ఇది నిబంధనలకు విరుద్ధం. అందువల్ల గతంలో ఆర్టీసీకి ఇచ్చిన స్థలాన్ని తిరిగి వెనక్కు తీసుకోవాలని ఉన్నతాధికారులకు లేఖ రాయనున్నాం.

ఊరు చివరకు తోపుడు బండ్లు!

... 5వ పేజీ తరువాయి

వీధి వ్యాపారులను మెప్మా సిబ్బంది గుర్తించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియం వద్ద ఉన్న తోపుడు బండ్ల వ్యాపారులు వెంటనే ఖాళీ చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులు ఆదేశించారు. పెద్ద చెరువు వద్ద దుకాణాలు వేసుకోవడానికి స్థలాలు కేటాయిస్తామని చెప్పారు. దీంతో పలువురు చిరువ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. పెద్ద చెరువు దగ్గర జనసంచారం ఉండదని, దీనివల్ల వ్యాపారం సాగదని అంటున్నారు. మెయిన్ రోడ్డుకి దగ్గరలో స్థలాలు చూపించాలని కోరుతున్నామని తెలిపారు. కాగా సిటీ క్లబ్‌ని ఆనుకొని ఉన్న చిరువ్యాపారులకు ఈనెల 20వ తేదీ వరకు గడువు ఇచ్చినట్టు తోపుడు బండ్ల వ్యాపారులు చెప్పారు.

పెద్ద చెరువు గట్టు ఆక్రమణ

పెద్ద చెరువు వద్దకు తోపుడు బండ్ల వ్యాపారులను తరలిస్తున్న విషయం తెలుసుకొని కొంతమంది వ్యక్తులు అక్కడ స్థలాలను ఆక్రమించి కర్రలు పాతారు. తోపుడు బండ్ల వ్యాపారులే స్థలాలు రిజర్వ్ చేసుకుంటున్నారని అధికారులు భావించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించుకున్నారని ఆలస్యంగా తెలుసుకొని ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నారు. దీనిమీద మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వరరావును వివరణ కోరగా, వీధి వ్యాపారులకు పెద్ద చెరువు వద్ద స్థలం కేటాయిస్తామని చెప్పారు.

టీడీపీ శ్రేణులు యాక్టివ్‌గా వుండాలి

» నాయకులు, కార్యకర్తల సమావేశంలో అనిత



సమావేశంలో మాట్లాడుతున్న వంగలపూడి అనిత

నక్కపల్లి, జనవరి 9: రాష్ట్రంలో ఎన్నికల ఫీవర్ ప్రారంభమైందని, బూత్ స్థాయి నుంచి టీడీపీ శ్రేణులు చాలా అప్రమత్తంగా ఉండాలని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత సూచించారు. మంగళవారం ఇక్కడ తన నివాసంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ టీడీపీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ధరల పెరుగుదల, వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, టీడీపీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ నెల 10న బుధవారం రా.. కదలి రా.. ప్రచార కార్యక్రమంలో భాగంగా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు తునిలో పర్యటిస్తారని చెప్పారు. ఈ సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు తరలిరావాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నక్కపల్లి, ఎస్.రాయవరం,కోటవురట్ల, పాయకరావుపేట మండల అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేశ్, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను, పెదిరెడ్డి చిట్టిబాబు, పార్టీ నాయకులు వైబోయిన రమణ, కొప్పిశెట్టి బుజ్జి, గింజాల లక్ష్మణరావు, నల్లపురాజు వెంకట్రాజు, పెదిరెడ్డి శ్రీను, మారిశెట్టి నానాజీ పాల్గొన్నారు.

నేడు టీఎన్‌టీయూసీ కార్మిక చైతన్య యాత్ర రాక

అచ్యుతాపురం, జనవరి 9: టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కార్మిక చైతన్య బస్సు యాత్ర అచ్యుతాపురం కూడలికి బుధవారం సాయంత్రం చేరుకుంటుందని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నమళ్ల కొండబాబు తెలిపారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ని ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు జి. రఘురామరాజు ఈనెల ఆరున బస్సుయాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ ప్రగడ నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మేరుగు బాపునాయుడు, కోవిరి బంగారయ్య, ఎజ్జల రామణ, మేరుగు వెంకటరావు, కె. దుర్గారావు పాల్గొన్నారు.

ఘనంగా డెకరేషన్ అసోసియేషన్ వార్షికోత్సవం

అచ్యుతాపురం, జనవరి 9: మండల చోడమాంబిక మైక్, లైటింగ్, టెంట్‌హౌస్ డెకరేషన్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం స్థానిక అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం వార్షికోత్సవాన్ని జరుపుకొని కొంత నిధిని సేకరించి, పేదవిద్యార్థులకు పంపిణీ చేయాలని తీర్మాణించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వందమంది రక్తదానం చేశారు. అనంతరం క్యాలెండర్‌ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐ బుచ్చిరాజు, మణేశ్వరరావు, శివ, కన్నారావు, నాగవెంకట్ పాల్గొన్నారు.

సబ్బవరం సీఐగా రమణ బాధ్యతల స్వీకారం



సబ్బవరం, జనవరి 9: స్థానిక పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పిన్నింటి రమణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏపీ ట్రాన్స్‌కో నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు, ప్రజాప్రతినిధుల, తోటి సిబ్బంది సహకారంతో మండలంలో శాంత భద్రతల పరిరక్షణతో పాటు రోడ్డు ప్రమాదాలు, అసాంఘీక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేసేందుకు కృషి చేస్తానన్నారు.

'వైసీపీ పాలనలో ప్రజలకు అవస్థలు'

పరవాడ, జనవరి 9 : వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు అవస్థలు తప్పడం లేదని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి అట్టా సన్యాసిఅప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు ఒమ్మి వెంకటరావు అన్నారు. మండలంలోని పెదముషిడివాడలో మంగళవారం బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే చంద్రబాబు, జనసేన కూటమి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్. నాయుడు, సంతోష్, పైలా పైడంనాయుడుపాల్గొన్నారు.

కార్మిక చైతన్యయాత్రకు తరలి రావాలి

పరవాడ, జనవరి 9 : టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి చిత్తూరు జిల్లా కుప్పం వరకు తలపెట్టిన కార్మిక చైతన్యయాత్ర బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు ఎన్టీపీసీ మెయిన్‌గేటు వద్దకు చేరుకుంటుందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాసవరపు అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులంతా చైతన్యయాత్రకు స్వాగతం పలికేందుకు అధికసంఖ్యలో తరలిరావాలన్నారు. కార్మికులంతా విధిగా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

» డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ కుమార్



వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్ కుమార్

నక్కపల్లి, జనవరి 7: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యసిబ్బంది అంకితభావంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ హేమంత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం సీహెచ్‌ఎల్ పురంలో జరుగుతున్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఎంత మంది రోగులు వచ్చారు ?ఎటువంటి సేవలందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. శిబిరాన్ని తహసీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో శ్రీనివాస్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ సందర్శించారు.

మెగా డీఎస్సీని ప్రకటించాలి

రాంబిల్లి, జనవరి 9: మెగా డీఎస్సీ ప్రకటించాలని ఈనెల 10న చలో సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ అన్నారు. మంగళవారం వాడపాలెంలో ఆయన ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా డీఎస్సీ ప్రకటించకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించాలని శివాజీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నేతలు పార్థు, లోవరాజు, రాజు, పవన్ పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో రైతులకు నష్టం : ధూళి

రాంబిల్లి, జనవరి 9 : రాష్ట్రప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో రైతులు, ప్రజలు నష్టపోతారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. భూ యాజమాన్య వారసత్వ హక్కులను నిర్ధయించే అధికారం న్యాయవ్యవస్థలకు కాకుండా రెవెన్యూ అధికారులకు బదలాయించడం అన్యాయమన్నారు. దీనివల్ల రాజకీయ నాయకుల జోక్యం పెరిగి నిజమైన హక్కుదారులకు అన్యాయం జరుగుతుందని, ఇలాంటి చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షులు రవిరాజు, మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన

నాతవరం, జనవరి 9 : ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై సామాన్యులకు అవగాహన ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుందని తహసీల్దార్ శ్రీనువాసునాయుడు అన్నారు. మంగళవారం నాతవరం వారపుసంతకు వెళ్లే దారిలో ఈవీఎంల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. నిరక్షరాసులకు ఎలక్ట్రానిక్ యంత్రంలో ఓటువేసే పద్ధతిని వివరించి, ఆ ఓటు ఎలా వేయాలో చూపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జడ్పీటీసీ సభ్యురాలు కె.అప్పలనర్స, సర్పంచ్ గొలగాని రాణి, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ కొండబాబు, ఎస్ఐ రామారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతల సన్యాసిరావు, బీజేపీ నాయకుడు ఎల్. విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

అటవీ అధికారుల యూనియన్ డైరీ ఆవిష్కరణ

నర్సీపట్నం, జనవరి 9 : అటవీ శాఖ జూనియర్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీని ఇన్‌చార్జి జిల్లా అటవీ అధికారి లక్ష్మణ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ మోహన్‌కృష్ణ, సింహాచలం, గోపీ, లక్ష్మణ్, కిరణ్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో రోగులకు పౌష్టికాహారం పంపిణీ

కృష్ణాదేవిపేట, జనవరి 9 : స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం గర్భిణులు, బాలింతలు, రోగులకు కొంగసింగి సత్యసాయి భజనమండలి ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ గాయత్రి, ఎన్. హరిప్రవీణ 80మందికి పాలు, రొట్టెలు, ఇతర పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో సాయి భక్తులతో పాటు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇనాం భూముల కోసం వైసీపీ నేతలు, అధికారులు కుమ్మక్కు

» సాగుదారుల ఆరోపణ

గొలుగొండ, జనవరి 9: వైసీపీ నేతలు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై ఈనాం సాగుదారుల నుంచి భూములు లాక్కునేందుకు రీ సర్వే చేస్తున్నారని స్థానిక సర్పంచ్ కొల్లి రాంబాబు ఆరోపించారు. మంగళవారం ఈనాం భూముల సాగుదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొత్తఎల్లవరం రెవెన్యూ గ్రామంలో 1,100 ఎకరాల భూమిని వందేళ్ల నుంచి సాగు చేసుకుంటున్నామన్నారు. గత నెలలో భూముల రీసర్వే పేరుతో రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించారన్నారు. భూ రీసర్వే ఎలా చేపడతారనే అంశంపై గ్రామ సభలో వెల్లడించలేదని సర్పంచ్, సాగుదారులు ఆరోపించారు. వైసీపీ నాయకులు ఈనాం భూముల సర్వే అధికారులు కుమ్మక్కైవుతున్నారన్నారు. సమస్య పరిష్కారం అయ్యేవరకూ సాగుదారులు వెంటే ఉండి సమస్య సాధనకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కొల్లు గోవింద, రైతులు శెట్టి దొరబాబు, చింతి శేషు, శెట్టి శివకుమార్, కర్రి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

నర్సీపట్నం, జనవరి 9 : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు ఎమ్మెల్యే గణేశ్ మంగళవారం పంపిణీ చేశారు. గొలుగొండ పప్పుశెట్టిపాలెంకి చెందిన సుర్ల రవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు రూ.3లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. పెదబొడ్డేపల్లి థెరిస్సా కాలనీకి చెందిన సరపాక దేవి కుమార్తె రేవతి కాలిపోవడంతో వైద్య ఖర్చులు కోసం సీఎం సహాయనిధి కింద రూ.2లక్షలు మంజూరు చేశారు.

ఎటు చూసినా చెత్తే..

కంపు కొడుతున్న వార్డులు

పూడిక పేరుకుపోయిన డ్రైనేజీలు

నర్సీపట్నం, జనవరి 9 : మునిసిపాలిటీలో ఏ వార్డుకి వెళ్లినా రోడ్లన్నీ చెత్తగా కనిపిస్తున్నారు. డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోయి దోమల బెడద పెరిగిపోయింది. పారిశుధ్య కార్మికులు గత 15 రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో వార్డులు శుభ్రం చేయక పోవడంతో చెత్త చెదారంతో రోడ్లు నిండిపోయాయి. సంక్రాంతి పండగ సందర్భంగా ఇళ్లలో శుభ్రం చేసుకోగా పోగైన చెత్తను గోనె సంచుల్లో మూటలు కట్టి రోడ్ల మీద పడేస్తున్నారు. ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణకు కూడా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదని విమర్శలు వస్తున్నాయి. క్షీణించిన పారిశుధ్యం ఫలితంగా దోమల బెడద పెరిగింది. పందులు వార్డులలో స్వైర విహారం చేస్తున్నారు. ఇదే పరిస్థితులు కొనసాగితే ప్రజలు రోగాల బారిన పడి ఆస్పత్రి పాలు అవుతారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


23వ వార్డు రోడ్డులో పేరుకుపోయిన చెత్త

అఖిలపక్షం బంద్‌కు పిలుపునిస్తే సంపూర్ణ మద్దతు

» మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జనవరి 9 : అఖిలపక్షం ఆధ్వర్యంలో ఎస్మాకి వ్యతిరేకంగా బంద్‌కు పిలుపునిస్తే టీడీపీ, జనసేన సంపూర్ణ మద్దతు ఇస్తామని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. బుధవారం ఎన్టీఆర్ మిని స్టేడియంలో రిలేదీక్షలు చేస్తున్న అంగ్‌వాడీలకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అఖిల పక్షం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం పెట్టారని, అంగన్‌వాడీలకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిస్తే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం అన్యాయమని అన్నారు. ఎమర్జెన్సీ ప్రకటించి ఇందిరాగాంధీ లాంటి నాయకురాలే చిత్తు చిత్తుగా ఓడి పోయిందన్నారు. తాను చెప్పిందే జరగాలనే అహంకార ధోరణిలో జగన్ మోహన్‌రెడ్డి ఉన్నారని, ఈ సైకో పాలనలో ప్రజాస్వామ్యానికి అర్థం లేకుండా పోయిందని విమర్శించారు. అంగన్‌వాడీలు వేతనాల పెంపు హామీని టీడీపీ మేనిఫెస్టోలో పెట్టడానికి చంద్రబాబు సుముఖంగా ఉన్నారని తెలిపారు.


అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

» రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్

మాకవరపాలెం, జనవరి 9: తెలుగుదేశం పార్టీ విజయానికి కార్యకర్తలందరూ సమిష్టిగా కృషిచేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. మంగళవారం తామరంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఇక్కడ అర్హులైన వారికి ఇంటి స్థలాలు ఇవ్వకపోగా పక్క గ్రామానికి చెందిన వారికి ఇంటి స్థలాలు అమ్ముకున్నారని ఆరోపించారు. గ్రామ స్థాయి టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైసీపీ ప్రభుత్వ అవినీతి, నిరంకుశ పాలనను ప్రజలకు వివరించాలని కోరారు. టీడీపీ గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం అనారోగ్యంతో ఉన్న టీడీపీ కార్యకర్త జక్కా శ్రీను ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు, కోసూరు శ్రీనివాసరావు, గంగిరెడ్ల నాయుడు, గంగిరెడ్ల నాగమణి, జనసేన నాయకులు సురేష్,భవానీ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్

వైసీపీ నుంచి జనసేనలోకి 30 కుటుంబాలు చేరిక

నర్సీపట్నం అర్బన్, జనవరి 9: మండలంలోని యరకన్నపాలెం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు వైసీపీ నుంచి జనసేన పార్టీలోకి మంగళవారం చేరాయి. జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త రాజాన వీరసూర్యచంద్ర వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. గ్రామాల్లో వైసీపీ నాయకులు గూండాయిజం పెచ్చుమీరిపోతుందన్నారు. వచ్చే ఎన్నికల నాటికి వైసీపీ ఖాళీ అయిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన టౌన్ అధ్యక్షుడు అదేపల్లి గణేష్, నాయకుడు మాకిరెడ్డి వెంకటమణ, తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి జనసేన కండువాలు కప్పుతున్న ఇన్‌చార్జి వీరసూర్యచంద్ర

సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఆర్థిక సాయం

మాకవరపాలెం, జనవరి 9: రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు ఏపీటీఎఫ్ మండల యూనిట్ సంఘీభావం ప్రకటించింది. అంతేకాకుండా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు రూ.53వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు ప్రసాద్, మూర్తి మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అలాగే మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్న ఎంఆర్‌సీ స్టాఫ్, సీఆర్‌పీ ఉద్యోగులకు ఏపీటీఎఫ్ ఆర్థిక సాయం చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎన్. శ్రీరామూర్తి, గౌరవాధ్యక్షుడు రాజు, నాయకులు సత్యారావు, ఆదినారాయణ, శేషగిరి రావు, మురళి పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో పారిశుధ్య కార్మికుల ఆందోళన

కృష్ణాదేవిపేట, జనవరి 9 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో పారిశుధ్య కార్మికులు ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నారు. తమ వేతనాలు పెంచాలని పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. పారిశుధ్య కార్మికుల సమ్మెతో గ్రామంలో వీధుల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

భూసమీకరణ ముసుగులో వైసీపీ నేతల అక్రమాలు

... 5వ పేజీ తరువాయి

వివాదం ఏర్పడింది. ఈ భూములు కొనుగోలు చేసిన రెడ్డి అనే వ్యక్తి కొన్నాళ్ల తరువాత మృతిచెందారు 2013లో అప్పటి రెవెన్యూ అధికారులు సర్వే నంబరు 20లో వున్న 39.38 ఎకరాలు ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ భూములు ఏపీఐఐసీకి దఖలు పడినట్టు అప్పట్లో సిమెంట్ దిమ్మలు కూడా ఏర్పాటుచేశారు. ఇదిలాఉండగా భూ సమీకరణను అడ్డం పెట్టుకుని స్థానిక వైసీపీ నేతలు ప్రభుత్వానికి చెందిన ఈ భూములను బినామీ రైతుల పేరుతో తిరిగి ప్రభుత్వానికి అప్పగించి లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. 47 మంది వరకు నకిలీ రైతుల పేర్లను భూసమీకరణ రికార్డుల్లో నమోదు చేసి, పరిహారంగా అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో ఏడు ఎకరాలను కొట్టేయడానికి పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఇక్కడ ఎకరా భూమి రూ.50 లక్షలు పలుకుతున్నది. లేఅవుట్‌గా అభివృద్ధి చేస్తే సెంటు రెండు లక్షల నుంచి మూడు లక్షల వరకు పలుకుతుంది. ఈ లెక్క న వైసీపీ నేతలు కొట్టేయడానికి ప్రయత్నిస్తున్న భూమి విలువ రూ.20 కోట్లు వుంటుంది.

లెక్కకు మిక్కిలిగా ఫిర్యాదులు.. పట్టించుకోని రెవెన్యూ అధికారులు

అనకాపల్లి మండలంలో భూసమీకరణ మాటున వైసీపీ నేతలు సాగిస్తున్న అక్రమాలపై గతంలో టీడీపీ, జనసేన, సీపీఎం నాయకులు, రెవెన్యూ అధికారులకు వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద స్వయంగా అమరావతి వెళ్లి భూపరిపాలన అధికారులకు ఫిర్యాదు అందజేశారు. అయినా ఇంతవరకు ఎటువంటి చర్యలు లేవు. కోడూరులోనే కాకుండా మండలంలోని పలుగ్రామాల్లో చేపట్టిన భూసమీకరణ వ్యవహారంలో కీలక పదవిలో వున్న ఒక ముఖ్యనేత తెరవెనుక ఉండడంతో భూసమీకరణ మాయాజాలంపై విచారణ జరిపించేందుకు అధికారులు సాహసించడం లేదు. ఇప్పటికైనా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్పందించి మండలంలో వివిధ గ్రామాల్లో జరిగిన భూసమీ కరణ, పరిహారం చెల్లింపు కోసం అధికారులు సిద్ధం చేసిన నిర్వాసితుల జాబితాలపై క్షేత్రస్థాయిలో బహిరంగ విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాగా, అనకాపల్లి మండలం కోడూరులో భూ సమీకరణలో అక్రమాలు జరిగినట్టు వస్తున్న ఆరోపణలపై ఆర్డీఓ చిన్నికృష్ణను వివరణ కోరగా, సర్వే నంబరు 20లో భూములు తమవేనంటూ గ్రామసభలో తహసీల్దారు సమక్షంలో రైతులు అంగీకారం తెలిపారన్నారు. బినామీ రైతుల పేర్లను రికార్డుల్లో నమోదు చేశారంటూ ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు. స్థానికుల నుంచి అభ్యంతరాలుంటే విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామన్నారు.

చోడవరంలో భూ దందా

... 5వ పేజీ తరువాయి

చేయించాలని నిర్ణయించినట్టు చెప్పారు.

సర్వే చేయాలని రెవెన్యూకు వినతి

సత్యనారాయణ, ఈవో, దేవదాయ శాఖ, చోడవరం

ఆర్టీసీ యాజమాన్యం ప్రస్తుతం లీజుకు ఇచ్చిన స్థలం ఒకప్పుడు దేవదాయ శాఖకు చెందినదే. గతంలో నామమాత్రపు ధరకు విక్రయించారు. పక్కనే స్థలం దేవదాయ శాఖకు చెందినదే! సర్వే నిర్వహించి దేవదాయ శాఖ స్థలం ఎంతమేర ఉందో నిర్ధారించాలని రెవెన్యూ శాఖ అధికారులను కోరాం. వారి నుంచి ఇంకా స్పందన రాలేదు. కాగా గతంలో ఆర్టీసీకి ఇచ్చిన స్థలాన్ని ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులకు వ్యాపార అవసరాల కోసం లీజుకు ఇచ్చారు. ఇది నిబంధనలకు విరుద్ధం. అందువల్ల గతంలో ఆర్టీసీకి ఇచ్చిన స్థలాన్ని తిరిగి వెనక్కు తీసుకోవాలని ఉన్నతాధికారులకు లేఖ రాయనున్నాం.

ఊరు చివరకు తోపుడు బండ్లు!

... 5వ పేజీ తరువాయి

వీధి వ్యాపారులను మెప్మా సిబ్బంది గుర్తించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియం వద్ద ఉన్న తోపుడు బండ్ల వ్యాపారులు వెంటనే ఖాళీ చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులు ఆదేశించారు. పెద్ద చెరువు వద్ద దుకాణాలు వేసుకోవడానికి స్థలాలు కేటాయిస్తామని చెప్పారు. దీంతో పలువురు చిరువ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. పెద్ద చెరువు దగ్గర జనసంచారం ఉండదని, దీనివల్ల వ్యాపారం సాగదని అంటున్నారు. మెయిన్ రోడ్డుకి దగ్గరలో స్థలాలు చూపించాలని కోరుతున్నామని తెలిపారు. కాగా సిటీ క్లబ్‌ని ఆనుకొని ఉన్న చిరువ్యాపారులకు ఈనెల 20వ తేదీ వరకు గడువు ఇచ్చినట్టు తోపుడు బండ్ల వ్యాపారులు చెప్పారు. పెద్ద చెరువు వద్దకు తోపుడు బండ్ల వ్యాపారులను తరలిస్తున్న విషయం తెలుసుకొని కొంతమంది వ్యక్తులు అక్కడ స్థలాలను ఆక్రమించి కర్రలు పాతారు. తోపుడు బండ్ల వ్యాపారులే స్థలాలు రిజర్వ్ చేసుకుంటున్నారని అధికారులు భావించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించుకున్నారని ఆలస్యంగా తెలుసుకొని ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నారు. దీనిమీద మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వరరావును వివరణ కోరగా, వీధి వ్యాపారులకు పెద్ద చెరువు వద్ద స్థలం కేటాయిస్తామని చెప్పారు.

చోడవరం
నియోజకవర్గం


ఆరోగ్య శ్రీకార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరం

» ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట, జనవరి 9: ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరమని చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. విజయరామరాజుపేటలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబంలో ఒకరికి రూ.25 లక్షల వైద్య సేవలు పొందవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, సర్పంచ్ వై.విజయకుమార్, ఉప సర్పంచ్ దొడ్డి జగన్నాథరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ యల్లపు గోవింద పాల్గొన్నారు.

ఎంపీపీకి పతీవియోగం

బుచ్చెయ్యపేట, జనవరి 9: అనారోగ్యంతో కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎంపీపీ దావకరపు నాగేశ్వరిదేవి భర్త నాగరాజు మృతి చెందారు. నాలుగు రోజుల క్రితం నాగరాజు అనారోగ్యంతో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. విశాఖకు తరలించాలన్న వైద్యుల సిఫారసు మేరకు నాగరాజుని కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్న విషయం తెలిసిందే. అక్కడ చికిత్స పొందుతూ నాగరాజు మంగళవారం మరణించారు. ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైసీపీ మండల అధ్యక్షుడు జోగా కొండబాబు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మరిసా నాని, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు డి.అప్పారావు, వైస్ ఎంపీపీలు జి.వెంకటేశ్వరావు, దొండా లలిత, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పలు పార్టీల నాయకులు నాగరాజుకు నివాళులర్పించారు.


నాగేశ్వరరావు (ఫైల్ ఫొటో)

కొత్తకోట సీఐ అప్పలనాయుడును కలసిన టీడీపీ నాయకులు

రావికమతం, జనవరి 9: కొత్తకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎల్.అప్పలనాయుడును టీడీపీ మండల నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకి పుష్ప గుచ్ఛం అందించి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, సీనియర్ నాయకులు కోట గోవిందరావు, కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను, బంటు శ్రీను, వెదురుపర్తి వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారి తారుమారు

» ఆనవాలు కోల్పోయిన వమ్మలి-జమ్మాదేవిపేట రోడ్డు

» ఆద్యంతం రాళ్లు తేలడంతో నరకప్రాయంగా ప్రయాణం

మాడుగుల రూరల్, జనవరి 9: మండలంలోని కింతలి రహదారి 'తారు'మారైంది. ఘాట్ రోడ్డు జంక్షన్ నుంచి కింతలి గ్రామం వెళ్లే వరకూ రోడ్డు ఆద్యంతం రూపు మారిపోయింది. తొమ్మిది కిలోమీటర్లు కలిగినఈ రోడ్డుపై పలు గ్రామాల వద్ద రాళ్లు తేలిపోయి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా పరిణమించింది. వమ్మలి-జమ్మాదేవిపేట రోడ్డు మార్గంలో వాడపాడు, జంపెన, గాదిరాయి, వమ్మలి, వీజేపురం, జమ్మాదేవిపేట, పొంగలిపాక, జాలంపల్లి, లోవ పొన్నవోలు, కింతలి వల్లాపురం, కింతలి తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం బైక్‌లు, ఆటోల్లో ఘాట్‌రోడ్డు జంక్షన్, మండల కేంద్రం మాడుగులకు వస్తుంటారు. అలాగే ఈ రోడ్డు మార్గంలో ట్రాక్టర్లు, లారీలు, వ్యాన్‌లు రాకపోకలు సాగిస్తున్నాయి. గత ఏడాది జూలైలో రోడ్డు పగుళ్లు ఏర్పడడంతో ఎక్స్‌కవేటర్‌తో పెచ్చులు తీసివేశారు. రోడ్డుపై వర్షం నీరు నిలవకుండా రోడ్డు అంచులు వద్ద తుప్పలు తొలగించారు. రోడ్డుపై క్రషర్ బుగ్గితో గుంతలు పూడ్చించారు. అయితే వర్షాలకు, వాహనాల రాకపోకలకు రోడ్డుపై కంకర రాళ్లు పైకి తేలాయి. ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు అంచులు కూడా పాడయ్యాయి. జంపెన, గాదిరాయి, వమ్మలి, జమ్మాదేవిపేట గ్రామాలతో పాటు పలు చోట్ల గుంతలు పడి, కంకర రాళ్లు పైకి తేలి అధ్వానంగా తయారైంది. గుంతలు పడిన రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. కంకరరాళ్ల వల్ల వాహనాల టైర్లు దెబ్బతింటున్నాయని వారు వాపోయారు. కొత్త రోడ్డు వేస్తే తప్ప ప్రయాణ కష్టాలు తప్పవంటూ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ రోడ్డు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ నిధులు రూ.9 కోట్లు మంజూరైనప్పటికీ టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందడుగు వేయడం లేదని సమాచారం.


రహదారిపై గాదిరాయి మలుపులో తేలిపోయిన కంకర రాళ్లు


తారు తేలిపోయి రూపుమారిపోయిన వమ్మలి-జమ్మాలిపేట రహదారి ఇదే..

నూతన భవనాలకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు

రావికమతం, జనవరి 9: మండలంలోని తట్టబంద, జడ్.బెన్నవరం, పి.పొన్నవోలు, మరుపాక, దొండపూడి గ్రామాల్లో రూ.9 కోట్లతో నూతనంగా నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలు, జలజీవన్ మిషన్ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు గ్రామ స్థాయిలోనే ప్రభుత్వ సేవలను అందించాలన్న ఉద్దేశంతో ఈ భవనాలను నిర్మించినట్టు చెప్పారు. గతంలో ఏ పని కావాలన్నా రావికమతం మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. అనంతరం దొండపూడి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. విజయవాడలో ఈ నెల 19న సీఎం చేతుల మీదుగా జరగన్న రూ.400 కోట్లతో నిర్మించిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహంతో పాటు స్మృతి వనం ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యాక్రమంలో ఎంపీపీ పైల రాజు, వైసీపీ మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ, మాజీ సర్పంచ్ రాజాన నరసింహులు, వైసీపీ నేత కంచిపాటి జగన్నాథరావు పాల్గొన్నారు.

రత్నంపేటలో పది వరి కుప్పలు దగ్ధం

రోలుగుంట, జనవరి 9: మండలంలోని రత్నంపేట గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పది వరి కుప్పలు దగ్ధమయ్యాయి. అలాగే గడ్డిమేటులు, పశువుల పాకకు అగ్నికి ఆహుతయ్యాయి. దీనిపై బాధితులు, స్థానిక ప్రజలు అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివారున పూడి రమణ, శెట్టి శ్రీను, కింతాడ అప్పారావు, కిర్నంపల్లి అప్పారావు, పూడి గోవింద, పూడి అప్పలనాయుడు, పూడి సొంబాబు, రాంపిల్ల పద్మప్రియలకు చెందిన వరి కుప్పలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో మంటలు వ్యాపించి వరి కుప్పలకు మంటలు వ్యాపించి దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసినా అప్పటికే నష్టం జరిగిపోయింది. ప్రమాదంలో రూ.3 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. తహసీల్దార్ వరహాలు, ఎస్ఐ సురేష్ మంగళవారం సందర్శించి వివరాలు సేకరించారు. ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని వారు తెలిపారు.


దగ్ధమైన వరి కుప్పలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు


దేవరాపల్లి సమ్మె శిబిరంలో చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

దేవరాపల్లి, జనవరి 9: డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. మంగళవారం దేవరాపల్లి, బుచ్చెయ్యపేట తదితర మండలాల్లో కార్యకర్తలు సహాయకలుఉ వినూత్నంగా నిరసన తెలిపారు. దేవరాలిపల్లిలో అంగన్‌వాడీలను సీఎం జగన్ నమ్మించి మోసం చేశారంటూ చెవిలో పూలు పెట్టుకొని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఎస్మా ప్రయోగాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, జీతాలు, గ్రాట్యూటీ సమస్యలను పరిష్కరించాలని నానాదాలు చేశారు. తక్షణమే జీవో-2ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, అంగన్‌వాడీలు జి.వరలక్ష్మి, పద్మ, సన్యాసమ్మ, కోమలి, గౌరీ పాల్గొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నేత డి.వెంకన్న మద్దతు తెలిపారు.

బుచ్చెయ్యపేటలో గడ్డి తింటూ నిరసన

బుచ్చెయ్యపేట: మండల కేంద్రంలో అంగ్‌వాడీలు మంగళవారం గడ్డి తింటూ నిరసన తెలిపారు. ఎన్నికల ముందు పాదయాత్ర సమయంలో జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తమపై ఎస్మా ప్రయోగించి బెదిరించాలని ప్రయత్నించడం దారుణమని అంగన్‌వాడీలు వాపోయారు. ఇలాంటి బెదిరింపులకు తాము బెదిరిపోయేది లేదని హెచ్చరించారు. డిమాండ్లను ఆమోదించే వరకు పోరాటాన్ని సాగిస్తామని యూనియన్ నాయకులు ఎలిసెట్టి అమ్మాజీ, కోవెల వెంకటలక్ష్మి, ఆది వరలక్ష్మి తదితరులు తెలిపారు.

మాడుగుల
నియోజకవర్గం

నాగయ్యపేటలో అభివృద్ధి పనులు ప్రారంభం


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి, జనవరి 9: మండలంలోని నాగయ్యపేట గ్రామంలో రూ.2.07 కోట్లతో పలు అభివృద్ధి పనులను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మంగళవారం ప్రారంభించారు. సచివాలయ భవన నిర్మాణానికి రూ.42 లక్షలు, నాగయ్యపేట-కడకొండ వరకు రూ.కోటి 25 లక్షలతో తారు రోడ్డును, రూ.18 లక్షలతో వెల్‌నెట్ సెంటర్, రూ.22 లక్షలతో ఆర్బీకే భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

దేవరాపల్లిలో గడప గడపకు..

మండల కంద్రంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రెల్లిపేట నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం చిన్నంనాయుడుకాలనీ, కొరుప్రోలుకాలనీ, మోడల్ కాలనీ మీదుగా ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి ఇంటి వరకు కొనసాగింది. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మండల కేంద్రంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, సర్పంచులు కర్రి పుష్ప, పెంటమ్మ ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పైడితల్లమ్మ, బూరే బాబూరావు, ఉగ్రూకల గంగాభవాని, సత్యవతి, మహలక్ష్మి, కృష్ణమూర్తి, సింహాచలంనాయుడు, కిలపర్తి భాస్కరరావు, సూరినాయుడు పాల్గొన్నారు.

సీఎంకు మంచి బుద్ధి ప్రసాదించాలి

కె.కోటపాడు, జనవరి 9: గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేస్తూ సర్పంచులకు నిధులు, విధులు లేకుండా చేసిన సీఎం జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని చౌడువాడలో పీఆర్ సర్పంచ్‌ల సంఘం ప్రతినిధి దాడి ఎరుకునాయుడు కోరారు. ఈ మేరకు ఆంజనేయస్వామికి మంగళ వారం వినతిపత్రం ఇచ్చారు. కేంద్రం నుంచి పంచాయతీలకు మంజూరవుతున్న నిధులను మళ్లించడంతో అభివృద్ధి పనులు చేయలేక పోయావని ఆయన వాపోయారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సంతోష్ యాదవ్, కుంచా అంజిబాబు, ఎం.శివ, మల్లునాయుడు, మహేష్ శ్రీను, రమేష్ పాల్గొన్నారు.


ఆంజనేయస్వామికి వినతి అందిస్తున్న దృశ్యం

నాలుగు వేల లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

దేవరాపల్లి, జనవరి 9: మండలంలోని రైవాడ జలాశయ శివారులో మంగళవారం పోలీసులు నిర్వహించిన దాడుల్లో నాలుగు వేల లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. అలాగే 40 లీటర్ల నాటుసారా పట్టుకున్నట్టు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. సారాతో అనంతగిరి మండలం జీనబాడుకు చెందిన శిరగం భీమన్నదొర పట్టుబడ్డారని, అతన్ని రిమాండ్‌కు తరలించామని చెప్పారు.